క్లుప్తంగా

బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి

పొన్నలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని ముండ్లమూరివారిపాలెంలో మంగళవారం 'బీ పడాయి బీ' కార్యక్రమంపై అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నారులకు ప్రయోగాత్మక విద్యను బోధిస్తే తక్షణమే తెలుసుకుంటారన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని చిన్నారులకు నేర్పించాలన్నారు. మర్రిపూడి సూపర్‌వైజర్ సుచరిత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

4న మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో వచ్చే నెల 4వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్ బ్రహ్మయ్య తెలిపారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు. అధికారులు పూర్తిసమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

లేఅవుట్‌ను పరిశీలించిన ఆర్‌డీఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని కె.బిట్రగుంట పంచాయతీలోని సర్వే నంబర్ 468-3ఏలోని 1.97 ఎకరాల అక్రమ లే అవుట్‌ను ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమ లే అవుట్ అని ఏర్పాటు చేసిన బోర్డును స్థల యజమానులు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇదే సర్వే నంబర్‌లోని 0.47 ఎకరాల స్థలాన్ని ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోగా ఆ స్థలాన్ని పరిశీలించారు. కన్వర్షన్ కాకముందే రోడ్లు, హద్దురాళ్లు వేయడంపై ఆమె విస్మయం వ్యక్తం చేశారు. అనంతరం కామేపల్లిలో ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్న 1.45 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ బి.జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక దాడులు జరగకుండా జాగ్రత్త వహించండి



సూచనలిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: పాఠశాలల్లో లైంగిక దాడులు జరగకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు హించాలని సీఐ సీహెచ్ హజరత్తయ్య అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిపై లైంగికదాడుల విషయం తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏఎస్సై శేషారెడ్డి, ఎంఈఓ-1 కత్తి శ్రీనివాసరావు, ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

28న మండల సమావేశం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లక్ష్యంతో కూడిన విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రవిచంద్రబాబు

పొన్నలూరు: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ రవిచంద్రబాబు అన్నారు. మండలంలోని కొత్తశింగరబొట్లపాలెం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాదని ప్రతి విద్యార్థి ఉన్నత చదువుల వైపు అడుగులు వేయాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా సన్మార్గంలో నడిచి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

కనిగిరిరూరల్: నవోదయ ప్రవేశ పరీక్షల్లో స్థానిక బోధి ధర్మ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. 2025-26 నవోదయ ఆరోతరగతి ప్రవేశానికి అర్హత సాధించిన ముగ్గురు విద్యార్థులు రెక్కల ధాన్య శ్రీరెడ్డి, హనీష్ నందన్, మేడగం చైత్రినిరెడ్డిలను పాఠశాల కరస్పాండెంట్ జి. రవీంద్ర, ప్రిన్సిపాల్ టి.జ్యోతి, శిక్షకుడు గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రకృతిని చెరబట్టిన..
'పచ్చ'ని దొంగలు

- గ్రావెల్ దోపిడీని పట్టించుకోని అధికారులు
- పట్టపగలే కూటమి నాయకుల అక్రమ తరలింపు
- రామాలయానికి మట్టి ఇవ్వని పోలీసులు
- 200 ట్రిప్పులు తరలిస్తున్నా పట్టని అధికారులు



రాజుపాలెం చెరువులో జేసీబీతో ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలింపు

ఉలవపాడు:

అధికారం ఉంది కదా అని కూటమి నాయకులు ప్రవర్తిస్తున్న తీరు ప్రకృతికి కూడా కోపం తెప్పించేలా ఉంది. ఇసుక, మట్టి, నీళ్లు, గ్రావెల్ ఇలా ఏదైనా అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. సోమవారం ఉలవపాడు మండల పరిధిలోని ఎల్‌రాజుపాలెం చెరువు నుంచి యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. సుమారు 200 ట్రిప్పుల పైన గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పట్టపగలే చెరువులో జేసీబీ పెట్టి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది.. తమను ఆపేవారు లేరు, ఎక్కడైనా యథేచ్ఛగా తరలిస్తామని బహిరంగంగా చెప్పున్నారంటే మండలంలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం అవుతోంది. చివరికి చెరువులో ఉన్న నీటిని కూడా పక్కనే ఉన్న మామిడి తోటలకు మోటార్ల ద్వారా నీరు పెట్టుకుంటున్నారు. ఇలా చేయడం వలన పశువులకు నీరు లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.

నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్న అధికారులు..

కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలకు అధికారులు పూర్తిస్థాయిలో అండగా ఉంటున్నారు. గ్రావెల్, ఇసుక తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. దీంతో కూటమి నాయకులు యథేచ్ఛగా అవినీతి వ్యాపారాలు చేస్తున్నారు. దారుణమైన విషయం ఏమిటంటే ఇటీవల రాజుపాలెం ఎస్సీ కాలనీలో రామాలయం నిర్మాణానికి గ్రావెల్ అవసరమై చెరువులోకి రావడంతోనే వెంటనే పోలీసులు వచ్చి అనుమతులు లేకుండా తీసుకువెళ్తే ఒప్పుకోమని హెచ్చరించారు. కాని కూటమి నాయకులు సోమవారం సుమారు 200 ట్రాక్టర్లు యథేచ్ఛగా తరలిస్తున్నా ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఇలా అధికారుల అండదండలతో గ్రావెల్ తరలింపు జరుగుతుంది. ఉన్నతాధికారులైనా స్పందించి అక్రమ తరలింపును అడ్డుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నేతలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎంపీపీ గాయం సావిత్రి, బలరామిరెడ్డి, ఈశ్వరమ్మ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో యక్కంటి శ్రీనివాసులరెడ్డి, ఇతర నేతలు

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు కలిశారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ ఈశ్వరమ్మ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, లింగంట్ల సర్పంచ్ మద్దిరత్తాలు, బీసీ సెల్ అధ్యక్షుడు మద్ది తిరుపతయ్య, హాజీపురం ఉపసర్పంచ్ ఏరువ వెంకటరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి, ముప్పాళ్లపాడు మాజీ సర్పంచ్ డి.పిచ్చిరెడ్డి, ఎం.సాంబిరెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే కందులు అమ్ముకోవాలి



ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ వెంకట రమణ

వీవీపల్లి: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే కందులను అమ్ముకోవాలని ఏడీఏ వెంకట రమణ అన్నారు. మండల పరిధిలోని ముద్దపాడు, తలకొండపాడు పంచాయతీల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కందులకు మద్దతు ధర రూ.7,550 ప్రకటించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం తలకొండపాలెంలో ఏర్పాటు చేస్తున్నారని, రైతులు అక్కడే విక్రయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి కె.ప్రకాష్ మాట్లాడుతూ మండలానికి 11 తైవాన్ స్ప్రేయర్లు మంజూరయ్యాయని, సబ్సిడీపై అందజేస్తున్నామని, కావాల్సిన వారు తీసుకోవచ్చన్నారు. ముద్దపాడు ఎంపీటీసీ మూల నారాయణరెడ్డి, ఏఈఓ పుల్లయ్య, వీఏఏ సాయి చరణ్, కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు

కొండపి: కందికి ప్రభుత్వం మద్దతు ధర రూ.7,550 కల్పిస్తుందని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దకండ్లగుంట, జాళ్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్లూరులో కంది కొనుగోళ్లకు చేస్తున్నామన్నారు. సొసైటీ సీఈఓ ఎస్.పవన్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ మహేష్, రైతులు పాల్గొన్నారు.

పామూరు: రైతులు కంది నూర్పిడిలో మెళకువలు పాటించాలని ఏఓ కె.రాధ అన్నారు. మండలంలోని వగ్గంపల్లె, రావిగుంటపల్లె గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి కందినూర్పిడిపై రైతులకు సూచనలిచ్చారు. కంది మద్దతు ధర క్వింటా రూ.7550, శనగ మద్దతుధర క్వింటా రూ.5450గా ప్రకటించామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నిర్దేశిత ఆర్‌ఎస్‌కేలలో పంటలను విక్రయించుకోవచ్చన్నారు. అయితే రైతులు పంటనమోదు చేసుకొని ఉండాలన్నారు. వీఏఏలు అభిషేక్, శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): రైతులు ఈ నెల 21వ తేదీ లోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదరాజుపాలెం, చింతపూడి రైతుసేవాకేంద్రాల పరిధిలో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగుపై పలు సూచనలిచ్చారు.

మర్రిపూడి: నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న కందులు, శనగలు, మినుములు కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు స్టీఫెన్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ విజయ్‌కుమార్

కనిగిరిరూరల్: కంది రైతులు మద్దతు ధరకు పంటను అమ్ముకోవాలని ఏఓ పి.జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని బడుగు లేరు, ఎడవల్లి సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. పీఎం కిసాన్ లబ్ధిదారులు ఏపీ ఎస్‌ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రాజేష్, రైతు నాయకులు పాల్గొన్నారు.

ఇంటిపన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీపీఓ వెంకటనాయుడు

పామూరు: గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతానికి ఘన వ్యర్థాల ద్వారా సంపద తయారీపై అన్ని పంచాయతీ పీఎస్‌లు, సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాడి వెంకటనాయుడు అన్నారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో మంగళవారం ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఈఓపీఆర్‌ఆర్‌డీ జి.అరవిందారెడ్డి అధ్యక్షతన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వెలిగండ్ల మండలంలోని గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణపై పీఎస్‌లు, గ్రీన్ అంబాసిడర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ జిల్లాలో రు.35 కోట్ల పైచిలుకు ఇంటిపన్ను బకాయిలు ఉన్నాయన్నారు. మండలంలో గ్రామ పంచాయతీ ఆర్థిక ప్రణాళికలపై రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఇళ్ల నుంచి సేకరించే చెత్తను ఇంటి వద్దే తడి, పొడి చెత్తలుగా విభజించి సేకరించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మి కంపోస్ట్ ఎరువును తయారీ చేసి విక్రయించడంపై దృష్టి సారించాలని, దీని ద్వారా ఆదాయం సాధ్యమవుతుందన్నారు. పరిశుభ్ర గ్రామాలకోసం ప్రజల్లో కూడా అవగాహన తెచ్చేలా కార్యక్రమాలు రూపొందించి అవగాహన చేయాలని సూచించారు. వెలిగండ్ల ఈఓపీఆర్‌డీ ఓ.అన్నమ్మ, జి.రత్నకుమార్, రాంప్రసాద్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హనుమంతునిపాడు: వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ బెట్ట కొట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలన్నారు. క్యాన్సర్, టీబీ, కుష్ఠ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీ భార్గవి, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



మాట్లాడుతున్న ఎస్‌కే ఖాజావలి

కనిగిరిరూరల్: ఆపద సమయాల్లో మహిళలకు రక్షణ, భద్రత కల్పించేందుకు శక్తి యాప్ ఎంతో దోహదపడుతుందని సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షుడు ఎస్‌కే నాయబ్ రసూల్ అధ్యక్షతన స్థానిక ఎంఎస్‌ఎం కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఖాజావలి మాట్లాడుతూ శక్తి యాప్‌ను మహిళలు, బాలికలు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సమాజంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్నందున తమను తాము కాపాడుకునేందుకు చైతన్య వంతులు కావాలన్నారు. స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్న మహిళలంతా శక్తి యాప్‌పై అవగాహన కల్పించుకుని, వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ పి సరోజని, సూపర్‌వైజర్లు ఎస్‌కే జరీనా, ఎన్ మల్లేశ్వరి, ఏ.ధనలక్ష్మి, పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన



డాక్టర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజన

పొన్నలూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు సంఖ్య పెంచాలని కనిగిరి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన అన్నారు. పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది హాజరు రిజిష్టర్‌ని, హాస్పిటల్‌ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ నిత్యం పరిశుభ్రంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది సమయపాలన పాటించి ఓపీల సంఖ్య పెరగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బందితో గ్రామాల్లో పీహెచ్‌సీపై అవగాహన కల్పించి కాన్పుల శాతం పెంచాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

346 బేళ్లు కొనుగోలు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్ కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 346 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. నేతివారిపాలెం గ్రామానికి చెందిన రైతులు వేలానికి 387 బేళ్లను తీసుకురాగా 41 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ. 250, సరాసరి ధర రూ.272.94 నమోదైంది. వేలంలో 12 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు నాణ్యమైన పొగాకు బేళ్లను తీసుకు వస్తే అత్యధిక ధరలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. అలాగే అన్య పదార్థాలు, గ్రేడ్ మిక్సు లేకుండా తీసుకురావాలని రైతులను కోరారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 280 పలికింది. కాకుటూరివారిపాలెం, శివపురం గ్రామాలకు చెందిన రైతులు 296 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 232 బేళ్లను కొనుగోలు చేసి 64 బేళ్లనుతిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260, సరాసరి రూ.275.20 పలికింది. వేలంలో 11 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఫారెస్ట్, రెవెన్యూ భూముల ఉమ్మడి సర్వే



సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, ఎఫ్‌ఆర్‌ఓ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని తుమ్మకుంట రెవెన్యూలోని సర్వేనంబర్ 221, 223, 224, 225 సర్వేనంబర్లతో పాటు పలు సర్వేనంబర్లలోని భూమిని మంగళవారం రెవెన్యూ, ఫారెస్ట్ భూములను తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ ఉమా మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్ట్, రెవెన్యూ భూములకు సంబంధించి హద్దురాళ్లు ఏర్పాటుచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఫారెస్ట్ భూములు ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. వీఆర్‌ఓ మాలకొండయ్య, వీఎస్ గురుప్రసాద్, ఫారెస్ట్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ వినియోగంపై అవగాహన కల్పించాలి



మర్రిపూడి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న దర్శి ఈఈ శ్రీనివాసరావు

మర్రిపూడి: పీఎం సూర్యఘర్ పథకంలో సోలార్ వినియోగంపై అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ దర్శి ఈఈ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. స్థానిక సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కూచిపూడిలో ఆయన గ్రామస్తులకు సోలార్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యుత్ బకాయిలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, గృహ విద్యుత్‌బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సబ్సిడీపై సోలార్ అందిస్తామన్నారు. సోలాల్ సిస్టమ్ అమర్చుకునే వారు 3 కిలో వాట్స్ మీటరు అవసరమని, అందువల్లా 1.5కిలోవాట్స్ విద్యుత్ మీటరు ఉన్న వారు వాడుకను బట్టి 3 కిలో వాట్స్‌గా మార్చాలంటే కేవలం రూ. 1200 ఖర్చు అవుతుందన్నారు. దీంతో మండల వాసులు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవడంవల్లా ఖర్చు పూర్తిగా తగ్గుతుందన్నారు. ఆయన వెంట డీఈ పాదిలి హరిబాబు, ఏఈ సుబ్బారెడ్డి సిబ్బంది ఉన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ, పార్టీ మండల అధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బియ్యం, నిత్యవసర సరుకుల పంపిణీ

కనిగిరిరూరల్: మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో దాత, సమితి సభ్యుడు చెరుకూరి నారాయణ దాతృత్వంతో స్థానిక ఇందిరా కాలనీ లోని నిరుపేద మహిళలకు బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో విజేత విద్యా సంస్థల అధినేత, థెరిస్సా సమితి సభ్యులు పసుపులేటి అరుణోదర్ పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో బైక్‌పై వెళుతున్న వ్యక్తిపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వెలిగండ్ల మండలం జిల్లెలపాడు గ్రామానికి చెందిన కారుమంచి చంటి బైక్‌పై హనుమంతునిపాడు మీదుగా వేములపాడు వెళుతున్నాడు. ఈ క్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో తేనెటీగలు గుంపుగా వచ్చి దాడి చేశాయి. తలకు, ముఖానికి కుట్టడంతో గాయాలయ్యాయి